సాక్షి
ఏలూరు

శనివారం । 1 । మార్చి । 2025



నేటి నుంచి కొల్లేటికోటలో జాతర

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర, కలిదిండి మరియమాత మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సీఐ వి.రవికుమార్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



ఘనంగా తెప్పోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమగుండం చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు: కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల్లో హుండీల ఆదాయం, చదివింపుల రూపంలో రూ.27,44,437 సమకూరింది.

అంకెల గారడీ.. బాబు బురిడీ


ఆక్వా రైతులను విస్మరించారు.. ఆయిల్‌పామ్, మామిడి సాగుదారుల ప్రస్తావన లేదు.. వేల కోట్ల నిధులు అవసరం ఉన్న ప్రధాన ప్రాజెక్టులకు వందలు, పదుల్లో కేటాయింపులు.. సూపర్‌సిక్స్ అంటూ హడావుడి చేసినా అరకొరగానే నిధులు.. అందులోనూ సగం పథకాలను అటకెక్కించిన వైనం.. ఇది కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్ తీరు. అంకెల్లో ఘనంగా చూపించి కేటాయింపులు అరకొరగా ఉండటంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి వంచన

- 'చింతలపూడి'కి నామమాత్రం
- 'తాడిపూడి'కి అరకొరగా..
- డెల్టా ఆధునికీకరణకు రూ.11 కోట్లే..
- ఆయిల్‌పామ్, ఆక్వా, మామిడి ఊసెత్తలేదు
- నిరుద్యోగి భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సుకు కేటాయింపుల్లేవు
- రాష్ట్ర బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు



చింతలపూడి మండలం ఫాతిమాపురం వద్ద తవ్వకం నిలిపివేసిన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ



సాక్షి ప్రతినిధి, ఏలూరు : రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నీటిపారుదల శాఖకు మొక్కుబడిగా నిధులు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టుకు మినహా మిగిలిన ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.4,890 కోట్ల నిధులు అవసరం కాగా.. రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. తాడిపూడి ఎత్తిపోతల పథకంలో పిల్ల కాల్వల నిర్మాణం, ఇతర పనులకు రూ.200 కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది, అయితే రూ.14 కోట్లే కేటాయించారు. డెల్టా ఆధునికీకరణకు ఏలూరు జిల్లాలో రూ.160 కోట్లు, పశ్చిమ గోదావరిలో రూ.300 కోట్లు అవసరం కాగా కేవలం రూ.11 కోట్లతో సరిపెట్టారు. గత ప్రభుత్వం నరసాపురంలో ఏర్పాటుచేసిన ఆక్వా యూనివర్సిటీకి రూ.380 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.35 కోట్లే కేటాయించారు.

కౌలు రైతులకు మోసం

ఆక్వా మేత ధరల నియంత్రణ, ఆక్వా సాగుదారులకు ఆర్థిక భరోసా, ఆయిల్‌పామ్, మామిడి సాగు చేసే రైతులకు భరోసా దక్కలేదు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా బడ్జెట్‌లో పట్టించుకోలేదు. కౌలు రైతులకు కొత్త చట్టం తెస్తామని ప్రకటించి ఉమ్మడి జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులను మోసం చేశారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సుమారు 40 వేల మంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 20 వేల మంది కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ పీఆర్‌సీ కోసం ఎదురుచూసి భంగపడ్డారు.

కూటమి.. సూపర్ సిక్స్ దగా

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఎటువంటి ప్రకటన లేదు. దీంతో జిల్లాలో 19 ఏళ్ల పైబడిన మహిళలకు 8.26 లక్షల మందికి మొండిచేయి చూపారు. తల్లికి వందనం పథకం కింద 2024–25లో ఏలూరు జిల్లాలో 3,23,303 మంది విద్యార్థులకు పథకాన్ని అమలు చేయలేదు. జిల్లాలో 1,98,179 రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.396 కోట్లు ఇవ్వాల్సి ఉండగా నిధులు కేటాయింపులో భారీగా కోత విధించారు. దీపం పథకానికి సంబంధించి జిల్లాలో 5,81,314 కనెక్షన్లకు ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే రూ.145.96 కోట్లు ఖర్చవుతుంది. దీనిలోనూ కోతలు పెట్టారు. ఇక ఎన్నికల హామీలు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి నెలకు రూ.1,500, 50 ఏళ్ల దాటిన బీసీ మహిళలకు పెన్షన్, చంద్రన్న బీమా పథకం, ఆటో, లారీ, టాక్సీ డ్రైవర్లకు రూ.15 వేలు, జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు, పెళ్లికానుక రూ.లక్ష, కాపు సంక్షేమానికి నిధులు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీకి రుణాలు వంటి పలు అంశాలను అటకెక్కించారు.

ఆక్వాకు అరకొరగా..



ఆక్వారంగానికి బడ్జెట్‌లో అత్తెసరు కేటాయింపులు చేశారు. నరసాపురంలోని ఆక్వా వర్సిటీకి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం కనిపించింది. ఆక్వా రైతులకు అందించే విద్యుత్ సబ్సిడీపై స్పష్టత లేదు. తల్లికి వందనం కింద రూ.12 వేల కోట్లు అవసరం కాగా రూ.9,400 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. రాష్ట్ర బడ్జెట్‌తో సామాన్యులకు పెద్దగా ప్రయోజనం లేదు.

– దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అన్నింటా కోతలు



కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అన్నివర్గాలనూ మోసం చేసింది. ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించింది. మహిళలను తీవ్రంగా మోసగించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాల విషయాన్ని ప్రస్తావించలేదు. రాష్ట్రంలో 1.55 లక్షల మంది దీపం లబ్ధిదారులు ఉండగా 90 లక్షలకు కుదించారు. ఇలా అన్నింటా కోతలు విధించారు.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు

పేరుగొప్ప.. ఊరుదిబ్బలా..



రాష్ట్ర బడ్జెట్ పేరు గొప్ప.. ఊరుదిబ్బలా ఉంది. ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్ ఇది. రూ.3.23 లక్షల కోట్ల బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.22,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లు ఉంది. దీనిని ఎలా పూడుస్తారో చెప్పలేదు. సాగునీటి కోసం 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 3.5 శాతమే కేటాయించారు. కౌలు రైతులను పూర్తిగా విస్మరించారు.

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

సంక్షేమం, అభివృద్ధికి చోటేది?



రూ.3.2 లక్షల కోట్ల బడ్జెట్ సంక్షేమం, అభివృద్ధికి దోహదం చేసేలా లేదు. రూ.80 వేల కోట్ల ద్రవ్యలోటు, రూ.14 వేల కోట్ల పన్ను ఆదాయం, రూ.12 వేల కోట్ల పన్నేతర ఆదాయం చూపారు. ఈ భారాలన్నీ ప్రజలపైనే మోపనున్నారు. డీఎస్సీ, నిరుద్యోగ భృతి తదితర అంశాలపై ప్రస్తావించలేదు.

– ఎ.రవి, కార్యదర్శి, సీపీఎం ఏలూరు జిల్లా

ఉద్యోగులకు నిరాశ



బడ్జెట్‌లో ఉద్యోగుల ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించింది. పీఆర్సీ ఊసే ఎత్తకపోవడం ఎంతవరకు సమంజసం. పెండింగ్ బకాయిలు ఎప్పుడు ఇస్తారో తెలియజేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగులకు న్యాయం చేస్తారని ఆశ పడితే నిరాశను మిగిల్చారు. ఉద్యోగుల కోసం సప్లిమెంటరీ బడ్జెట్ ప్రవేశపెట్టాలి.

– చోడగిరి శ్రీనివాసరావు, జిల్లా ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు

విద్యారంగంపై చిత్తశుద్ధి కరువు



ఉద్యోగులకు 2023 నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ నిధుల గురించి, ఆర్థిక బకాయిల గురించి ప్రస్తావించకపోవడం బాధాకరం. పీఆర్‌సీ అమలు చేసే వరకూ ఐఆర్ ఇచ్చేలా కేటాయింపులు లేవు. విద్యకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుంది.

– తాళ్లూరి రామారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పీఆర్‌సీకి నిధులేవి ?



పీఆర్సీ ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైనా బడ్జెట్‌లో పీఆర్సీ, ఐఆర్ అమలుపై స్పష్టత లేదు. సీపీఎస్/జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై ప్రస్తావించలేదు. పాఠశాల విద్యకు గతేడాది 10.15 శాతం నిధులు కేటాయించగా ఈ ప్రభుత్వం 9.86 శాతం మాత్రమే కేటాయించారు.

– పువ్వుల ఆంజనేయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు



బ్యాలెట్ బాక్సులను సరిచూస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో బ్యాలెట్ బాక్సులు ఏలూరు చేరుకున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు మన్యం, కాకినాడ జిల్లాల నుంచి పటిష్ట భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు సిబ్బంది తీసుకువస్తూనే ఉన్నారు. బ్యాలెట్ బాక్సులను ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అధికారులకు తరలించారు. ఇక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకులు సీహెచ్ శ్రీధర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ పర్యవేక్షించారు.

అంబులెన్సుల తనిఖీ



తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భీమడోలు చక్కెర కర్మాగారం వద్ద అంబులెన్స్ అదుపు తప్పి డివైడర్‌ను ఢొట్టిన ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. వాహనాల నిర్వహణ తీరును పరిశీలించారు. జాగ్రత్తగా వాహనాలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. ఎంవీఐలు ఎన్‌డీ విఠల్, బి.శేఖర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి పెట్టాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల్లో సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ కోరారు. స్థానిక విద్యానగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో ఎటువంటి వివాదాలు రాకుండా నిర్వహించాలన్నారు. ఫీజు చెల్లించని కారణంగా జిల్లాలో అక్కడక్కడా విద్యార్థులను యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాటిపైనా అధికారులు దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని ఆయన సూచించారు.

ఇన్‌కం ట్యాక్స్‌లో మార్పులపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న విశాఖ ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఇన్‌కం ట్యాక్స్‌లో చాలా మార్పులు వస్తున్నాయని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ బి.శ్రీనివాస్ అన్నారు. ఏలూరు డివిజన్ ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక అతిథి హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. ఇంట్లో నుంచే రిటర్న్స్ దాఖలు చేసే అవకాశం ఏర్పడిందన్నారు. మార్చి 15 లోపు అడ్వాన్స్ ట్యాక్స్‌లు చెల్లించాలని గుర్తుచేశారు. ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించిన వారికి తమ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. సదస్సులో రాజమహేంద్రవరం అడిషనల్ కమిషనర్ డి.హేమ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి పరిశోధనలు కీలకం

తాడేపల్లిగూడెం: దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు కీలకమని వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు జేవీ రమణమూర్తి అన్నారు. శుక్ర వారం ఏపీ నిట్‌లో జరిగిన జాతీయ సైన్సు దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశం గర్వించదగ్గ మేధావి సీవీ రామన్ అని అన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో ఆధునిక సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలను చేయాలన్నారు. డీన్‌లు హిమబిందు, జయరామ్, సందీప్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ విభాగాధిపతి ఎం.అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. త్రిశూల స్నానం



త్రిశూల స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు తీర్థపు బిందె, నిత్యహోమం, బలిహరణ, గణపతిపూజ అనంతరం స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ఆవరణలో శివయ్యకు త్రిశూల స్నానాన్ని అట్టహాసంగా జరిపారు. అనంతరం గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వసంతోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. రాత్రి ఆలయంలో స్వామివారికి 21 చుట్లు పల్లకి సేవ నిర్వహించారు.

రేపు ట్రెజరీ సంఘ ఎన్నికలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ పశ్చిమగోదావరి జిల్లా సంఘ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్టు ఉప ఖజానా అధికారి జె.రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరంలోని జిల్లా ఖజానా, లెక్కల కార్యాలయ ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహిస్తారని, ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, జి.నరేంద్ర కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎ.ఆంజనేయులు వ్యవహరిస్తారని రామారావు తెలిపారు.

ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్‌కు డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉభయ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ఎన్నికల సంఘానికి డిమాండ్ చేశారు. ఎన్డీఏ (టీడీపీ) కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇస్తాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో ఎన్నికల అధికారులు కుమ్మక్కై తన నామినేషన్‌ను కుట్రపూరితంగా రిజెక్ట్ చేసి పోటీలో లేకుండా తప్పించారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశానన్నారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఈనెల 12 ఫిర్యాదు చేశానని.. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో 25న కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ జరిపి తన నామినేషన్‌ను పునరుద్ధరించాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు.

కనుల పండువగా రథోత్సవం

ముగిసిన బలివే శివరాత్రి ఉత్సవాలు



బలివే వీధుల్లో రామలింగేశ్వరునికి రథోత్సవం


బలివే(ముసునూరు): బలివేలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. బలివే క్షేత్రానికి గురు, శుక్రవారాల్లో వేలాదిగా భక్తులు తరలి వచ్చి, తమ్మిలేరు, జల్లు స్నానాల వద్ద అమావాస్య స్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. పితృదేవతలకు ముక్తి కలగాలని బ్రాహ్మణులకు, పేదలకు దానాలు చేశారు. గురువారం రాత్రి స్వామికి బలివే గ్రామ వీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై ఎం.చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం ఉదయం బిందె తీర్థం, బలిహరణ, వసంతోత్సవం, అవభృతం, సాయంత్ర హోమం, బలిహరణాదులు, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణం చేసి భక్తి శ్రద్ధలతో పవళింపు సేవ నిర్వహించారు. దీంతో శివరాత్రి ఉత్సవాలు ముగిసినట్లు అధికారులు తెలిపారు.

హుండీల ఆదాయం రూ.13.77 లక్షలు

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.13.77 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద ఉత్సవాల అధికారి కె.అనూరాధ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. అనంతరం ఆదాయ వివరాలను వెల్లడించారు. శాశ్వత, తాత్కాలిక హుండీల ద్వారా రూ. 13,77,951 ఆదాయం లభించగా, పూజా టికెట్లు, విరాళాల ద్వారా స్వామికి సుమారు రూ.12 లక్షల ఆదాయం లభించిందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఝలక్

- పరీక్షా కేంద్రాలకు ఉచిత బస్సు సౌకర్యం నిలిపివేత
- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 33,511 మంది విద్యార్థులు.. 55 కేంద్రాలు



ఏలూరు పీడీబీటీ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. గతంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేవారు. అలాగే పరీక్షా సమయాలకు అనుకూలంగా బస్సుల షెడ్యూళ్లను మార్చేవారు. అయితే ఈ ఏడాది ఉచిత ప్రయాణాన్ని నిలిపివేశారు. దీంతో విద్యార్థులు సొంత ఖర్చులతో కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. బస్సులను సరైన సమయంలో అందుకోకుంటే పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కష్టమవుతోంది. ఇదిలా ఉండగా నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించబోమని విద్యాశాఖ అధికారులు చెప్పారు. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి పరీక్షలు

జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి 19వ తేదీ వరకు ఫస్టియర్, ఈనెల 3 నుంచి 20 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు 15,058 మంది, సెకండియర్ విద్యార్థులు 18,453 మంది ఉన్నారు. మొత్తంగా 33,511 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 14,561 మంది, బాలికలు 18,950 మంది ఉన్నారు.

55 కేంద్రాలు సిద్ధం

జిల్లాలో 55 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షల పర్యవేక్షణకు 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 55 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. మొత్తంగా 640 రూముల్లో పరీక్షలు జరుగనుండగా 740 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 2 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ

జంబ్లింగ్ విధానంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 720 సీసీ కెమెరాలను అమర్చారు. జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు, భీమడోలు, జీలుగుమిల్లి, కలిదిండి కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి గట్టి నిఘా ఏర్పాటుచేశారు. ప్రశ్నాపత్రాలను భద్రపరచడానికి 21 స్టోరేజ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జెరాక్స్ దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పరీక్షా కేంద్రాల వద్ద 163 బీ సెక్షన్ అమలు చేస్తున్నాం. కేంద్రాలకు సమీపంలో ఎవరూ గుమిగూడి ఉండకూడదు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశాం. ఏలూరులోని కోటదిబ్బ ఆర్ఐఓ కార్యాలయంలో 08812 230197 నంబర్‌కు సంప్రదించవచ్చు. అలాగే రాష్ట్రస్థాయిలో 1800 425 1531 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుంది. హాల్‌టికెట్ల కోసం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం. అటువంటి కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

– కె.యోహాన్, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

అదుపుతప్పి అంబులెన్స్ బోల్తా

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న హృద్రోగి



పాతూరు వద్ద బోల్తా కొట్టిన అంబులెన్స్



క్షతగాత్రులను మరో అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

భీమడోలు: హృద్రోగిని విజయవాడ తరలిస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ అతివేగంతో అదుపుతప్పి రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటన జాతీయ రహదారిపై సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు షుగర్స్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి తాడేపల్లిగూడెంలో గుండె వ్యాధితో బాధపడుతున్న పల్లి వీరాస్వామిని ప్రైవేట్ అంబులెన్స్‌లో విజయవాడ తరలిస్తున్నారు. వీరాస్వామితో పాటు ఆయన భార్య ఉదయకుమారి కూడా ఉన్నారు. మార్గమధ్యలో పాతూరు వద్ద ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో తప్పించబోయి అంబులెన్స్ బోల్తా కొట్టింది. వీరాస్వామికి ఎటువంటి ప్రమాదం జరగకపోగా ఉదయకుమారి, డ్రైవర్ కృష్ణారెడ్డి, టెక్నీషియన్ గంగరాజుకు గాయాలయ్యాయి. రోగితో పాటు ఆమె భార్యను మరో అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు. డ్రైవర్, టెక్నీషియన్‌ను 108లో తాడేపల్లిగూడెంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.